సింహాద్రిరావు ఆనందానికి మేరలేకపోయింది. డిప్టీ ఇనస్పెక్టరు కూడం ముచ్చటపడ్డాడు. అతను ఎప్పటినుంచో నాలుగు కర్రలు సంపాదించి. అడిగిన పెద్ద మనుష్యులకి బహూమానం చేద్దామని అను కొంటున్నాడు. కాని అంతవరకు కుదరలేదు.

వాకిటిలో బండి సిద్ధంగా ఉంది. అడుగునంత గడ్డి గాదరవేసి, పైన ఈతాకులచాప పరిచారు. సామానులు బండిలో పడవేశారు. సింహాద్రిరావు సొంతగా తన సూట్ కేస్ తీసుకువెళ్ళి దానిలో పెట్టాడు. ఇద్దరూ బండెక్కి కూర్చున్నారు. ఎడ్ల తలతాళ్లు పట్టుకొని బండివాడు ముందు నిలుచున్నాడు. దూరంగా బంట్రోతు నిలుచున్నాడు.

"సరేకాని అబ్బాయీ ! ఇరెసున కందెన పెట్టేవా?" అని బండి వాణ్ని సింహాద్రి ప్రశ్నించాడు.

"సిత్తం బాబయ్యా !" అన్నాడు బండివాడు.

"మాటలలో ఏడవ్వయ్యా !" అన్నాడు సింహాద్రిరావు.

"సిత్తంబాబయ్యా !" అన్నాడు బండివాడు బెదురుతూ.

"సరే! నిన్ను బళ్ళోవేసి పురం పెడితేనేగాని దమ్మిడీకి పనికి రావు ! నిన్నడగడగం ఎందుకో తెలుసా? ఇరుసున కందెన పెట్టక పర మేశ్వరు బండినయినా బారదు సుమతీ ! అన్నాడు శాస్త్రకారుడు. ఇహ మన బండీ ఓలెక్కా చెప్పుమా !" అన్నాడు సింహాద్రిరావు.

"ఇరుసుకు కందెన ఉండదేంటండి బాబయ్యా!" అని బండివాడు తలపాగా ఎత్తి బుర్రగోకుకొన్నాడు.

"నేను ప్రశ్నించేనని అట్టే కోపగించుకోకు! ఈ కాలంలో మిల్లు బట్టలేనా దొరకకుండా ఉన్నాయి !" అన్నాడు సింహాద్రిరావు.

బండివాడు తలపాగ నెత్తిని అణిచేసి "నిజమే బాబయ్యా ! గుడ్డముక్కకికూడా కరువైపోయిందండి. సచ్చి పోతున్నాం. తమవంటి ప్రభువులు ఒంటిని సివికిన గుడ్డ ముక్క ఏదేనా పారేస్తేగాని మాలాంటి దిక్కుమాలినోళ్ళు బతికే ఎత్తులేదండి బాబయ్యా !" అన్నాడు.

నీ బండి పని మాత్రమే నువ్వు చూసుకో అన్నట్టుగా ఉపాధ్యాయుడు బండివాడి వైపు తీవ్రంగా చూశాడు.

